కషాయం పోసినాడు గోపెమ్మ చాలుచాలనేలాగు. చావడిలో నుంచి సర్వసామాన్యపు పేరంటాడ్రంతా గోపెమ్మతల్లి వాయనా లిస్తుంటే పుచ్చుకుంటూ ఊ తొంగిచూడ్డం, విజయలక్ష్మమ్మ కూడా వాళ్లల్లో కలిసిపోయిందనుకోవడం, విజయలక్ష్మి త్రివిక్రమ రావుకేసిచూస్తూ తన చెంగుతాళంచెవి కావలిసొస్తే విప్పుకోమనడం.

త్రివిక్రమరావు "ఇంటికిరావు నీవు?" అన్నాడు. భార్య కేసిచూస్తూ. విజయలక్ష్మి "ఇంకెందుకు ఇల్లు? సెనగలు నేనింటికి పట్టుకునివెళ్లి వేయించనక్కరలేదు. రుబ్బనక్కరలేదు. మీకు పెట్టనక్కరలేదు. నే తినక్కరలేదు, ఇంకెందుకు ఇల్లు?" అంది. పకపకా నవ్వుకున్నారు అంతా.

... ... ... ... ...

## ముగురప్పా సెల్లెండ్రలోనూ తెలివిమంతురాలు ఎవతె?

రామవర్మ కూతుళ్లు ముగ్గురు. వరుసగా పెద్దమ్మాయి, చిన్నమ్మాయి, చిట్టమ్మాయి అని పిలవడమేకాని పేర్లుపెట్టి పిలవక పోవడంచేత చాలాకాలంవరకూ వాళ్ల పేర్లెవరికీ తెలియవు. పెద్దెదిగి వారివారి మగలతో కాపరాలుచేస్తూ వచ్చిందాకా ఎవరికీ తోచలే "పేర్లుపెట్టి పిలవాలి అడపిల్లల్ని పెద్దమ్మాయి, చిన్నమ్మాయి, చిట్టమ్మాయి అని పిలవకూడదు. పిలిచినా వాళ్లు పలకరు" అని.

అదెట్లా సంభవించిందంటే పెద్దమ్మాయిని రామవర్మా వాళ్ళూ పెద్దమ్మాయి యని పిలుస్తూంటే పెద్దామ్మాయి మగడో నాడు పెద్దమ్మాయి యేమిటి పెద్దమ్మా దద్దమ్మా" అని కినిసేడు. అదిచూచి చిట్టామ్మాయి మగడు "చిట్టు పొట్టు తవుడు దూగర ...? " అన్నాడు. చిన్నమ్మాయి మగడు చిరునవ్వు

నవ్వుతూ తన భార్య మొగంకేసి చూచినాడు. భార్య "అనండి మీకుతోచినమాట మీరనండి చిన్నీ చిన్నీ త్రొక్కుడుబిళ్ళా" అని అంది. "నిన్ననందే నీకంత ఉడుకుల మోత్తనం ఎందుకే?" అంది రాఘువర్మ భార్య.

అప్పట్నుంచి మదాలస, త్రిజట, ప్రమద అని వాళ్లవాళ్ల అసలు పేర్లను పిలుస్తూ వచ్చేరు ఇంటిల్లిపాదీ.

మరో మారోనాడు అల్లుళ్ళంతా అత్తారింటికి వచ్చివున్న రోజుల్లో ఓ మధ్యాహ్నం త్రిజట పెనిమిటి త్రిజటతో "నీ పేరు రాక్షసిపేరు" అన్నాడు. "పోనీలెండి మీరు పిల్చేదిలేదుగా పేరు పెట్టి. ఓయి ఆయి ఓం బాయి అనేగా! రాకసి పేరవితేం దేవత పేరవితేం" అంది త్రిజట. "కాని త్రిజటకల అంటే మహ యెక్కువైంది" అన్నాడు మగడు. "నెమలికలమా?" అంది పడుచు. "కలంకాదు కల" అన్నాడు ప్రియుడు. "కాలాని క్కుకుండా కలక్కూడా అధిక్యత వుందా లోకంలో. నాకు రోజురోజూ వస్తూనే వుంటుంది కల. ఈసరి కెన్నికలలు కన్నానో లెక్కాపత్రం లేదు" అంది పిల్ల. అంటూ నిద్రపోయింది. మగడామెనిదర నిజం నిదరా యుత్తుత్తినిదరా అని యోజించడం మొదలెట్టేడు.

"కలలు అంటే మనుష్యులు కల్లలుగా తోసేస్తారు. కాని ఇప్పుడు నాయీ వల్లభ అనుభవించే కల నిజమైందని నాకు తట్టుతూవుంది. నిజంగా జరుగుతూ వున్నట్టుగానే నాకు గోచరిస్తూ వుంది" అని అనుకుంటూ త్రిజట మగడు త్రిజట నిదరపోతూ వున్నప్పటి ముఖాబ్జంమీది నునుజెమ్మట గమనిస్తూ తుడిచేడు.

ఇదంతా వాళ్ల పడగ్గదిలో ఈవల ఆవేళకు మదాలస తన తండ్రియైన రామవర్మకడ కూర్చుండి పుస్తకం చదువుతూ అర్థం చెబుతూంది. ప్రమద ఆ పక్కనే పెద్ద చట్రంమీదమోపి ఓ చిత్తరువు లిఖిస్తూంది. రామవర్మ అడిగేడు "ఏదీ త్రిజట ...చేసోంది"

అని. ఏమోఏమో అనుకున్నారు అంతా. ఆ అనుకోవడంలోనే ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ మగనిదగ్గరుందని సూచించినారు.

త్రిజటమగ డావలకువచ్చి "ఏంవిటి లేపమంటారాయేం? నిదరోతూంది" అన్నాడు. రామవర్మ నవ్వుతూ "అడిగానోయి! అంతే" అన్నాడు. ప్రమద "బాబయగారూ అస్తమానం మొద్దు నిద్దరేనండి దానికి. బొమ్మలు రాయదు. పుస్తకం చదవదు. మాటాడితే నిదర" అంది. మదాలస ప్రమద నెంచి "నీకు పుస్తకం చదవడం చేతనవునూ?" అంది. ప్రమద "నీకు బొమ్మలురాయడం చేతనవునూ?" అంది. రామవర్మ నవ్వుతూ "త్రిజట కేల్లాయైనా మీకున్నంత చుఱుకూ తెలివితేటలూ లేవ్రా" అన్నాడు. ఆమాట మామగా రన్నప్పుడు త్రిజట మగడు పరాధ్యానంగా కొంచెం దూరాన్నుండిపోయేడు. లేకుంటే జవాబు చెప్పేవాడే.

కాస్సేపటికి త్రిజట వళ్లువిరుచుకుంటూ కళ్ళు నులుపుకుంటూ లేచి తనదగ్గర మగనికోసం చూచి లేకపోవడంతోటే నడవలోకి వచ్చింది. రామవర్మ భార్య అప్పటి కాపనీ యీపనీ చక్కబెట్టుకొని వంటింట్లోంచి నడవలోకివస్తూ "ఎవరికి చురుకు లేదు. తెలివితేటలు లేవంటున్నారు" అంది గట్టిగా. అప్పటికి అల్లుళ్ళు ముగ్గురు అక్కడేవున్నారు. దగ్గరగా "అప్పుడే విన్నావు? నీకే" నన్నాడు రామవర్మ. ప్రమద అంది "కాదే నీక్కాదే చిన్నక్క" కంది. "అదిగో చిన్నక్కంటే చూడు. త్రిజటక్కను" అన్నాడు త్రిజట మగడు మరదల్ని. తనపేరు మగడుచ్చరించేడని సుంత నవ్వుకుంది త్రిజట. పెళ్లాంపేరు పైకన్నాడని తక్కినవాళ్లంతా మరింత గందరగోళంగా నవ్వుకున్నారు.

త్రిజట అప్పు డందర్నీ ఊరుకోమని అంది "నాకో కలొచ్చింది వింటారా?" అని. "ఓస్ కలేనా?" అని మొదట మదాలస అంది కాని తువకంతా ఏదిచెప్పు వింటాం అయినా గానీ" అన్నారు.

"నాకు రెక్కలొచ్చాయి, నేనాకాశంలో వున్నానట" అంది త్రిజట. అంటే ప్రమద "ఆకాశంలోవుంటే మేఘాలు చుట్టేసుకోలే" అంది. "త్రిజట చుట్టేసుకోకేం? చుట్టేసుకొని చుట్టేసుకొని చుట్టేసుకోవడంలో వూరకే ఊమారిపోవడం మొదలెట్టాయి. ఓమాటు సింహంలాగు ఓమాటు లేడిలాగు ఓమాటు మనిషిలాగు ఓమాటు మానులాగు" అంది. "అయితే మాట్లాడేవు మేఘంతో?" అంది మదాలస. త్రిజట "మాట్లాడకేం? మహ చక్కా మాట్లాడాను. ఏవూరెడతావు అని అడిగింది మేఘం నన్ను. అడిగితే దాని చెవిలో చెప్పాలనుకుని ముందుకు వంగేతలికి చెవిలాగున్నదల్లా కన్నైంపోయింది. కంటికి చూపిద్దాము నేవెళ్ళేవూరని యనుకొనేతలికి కన్నులాగున్నదల్లా నోరైపోయింది. నోరల్లా ముక్కైపోయింది. కొంతసేపటికంతా తలలా జుత్తులాగైపోయింది. మరికొంత సేపటికి తలాలేదు గిలాలేదు అంతా గిలాబాచేసిన గోడలా గడ్డంగా నిలిచిపోయింది. ఇక దేనికి జెప్పనా అని యూరుకున్నాను" అని చెప్పింది. "అలా ఐతే రెక్కలున్నా గానీ నీకడ్డేదో ఒహటి కలిగించిదన్నమాటే" అంది తల్లి. తండ్రి అన్నాడు "అయితే రెక్కలాడించుకుంటూ పోతూంటే మేఘం పటాపంచలుగాలే?" అని. దానికి జవాబు త్రిజట ఏమి చెబుతుందా అని మదాలస మగడు ప్రమద మగడు పరకాయించి చూస్తున్నారు త్రిజటను. "తెలివైనవాళ్ళెవరన్నా వుంటే బాబయ్యగారి ప్రశ్నకు జవాబు చెబుతారు?" అంది త్రిజట. ఎవరి మట్టుకు వారంతా ఊరకున్నారు. "నిజమే బాబయ్యగారడిగిన సంగతి గొప్పసంగతే. రెక్కలాడుతూవుంటే మేఘం పటాపంచలు గాకుండా గోడల్లే అడ్డుంటుందా?" అని అనుకున్నారు.

"ఓయి మీయింట బటారంగాను. నేచెప్పేది కలన్నమాట మరచిపోయినార్రా" అని విఱగబడి నవ్వింది త్రిజట. "ఉత్త తెలివి తక్కువ వాళ్లు మీరంతా" అంది తల్లి...

దానిమీద త్రిజటమగ డుడుక్కొన్నట్టై "నీ తెలివికి నీవే సంతోషించాలి గోడల్లే మేఘమడ్డుండిపోతే ఏలాలేచి వచ్చావిల్లా నీవిప్పుడు?" అని అడిగేడు. త్రిజట అంది "నా రెక్కల విసురుకు పోలేదుగాని మేఘం దానంతటది వానకురిసి మాయమైంది" అని. వాన? అన్నాడు మగడు. "కల్లో వానంటే మొగమ్మీద పోసే చెమటన్నమాట" అంది త్రిజట. "ఓసి ప్రియురాలా! మేలుకుండే సేవచేయించుకున్నావు నాచేత? ఇప్పుడొప్పుకొన్నాను తెలివైనదానివని" అన్నాడు త్రిజట మగడు.

మగడొప్పుకొంటే అంతా ఒప్పుకున్నట్టే.

... ... ... ... ...

## మాయింట ఒక సంక్రాంతి విశేషం

అన్ని పండగలమాటా ఎలావున్నా సంక్రాంతి పండగయొక్క తరితీపి తలుచుకుంటినా అంటే నాకదోవిధంగా తట్టుతూంటుంది. పెద్ద పండగనాడెవరూ ఏ దంపతులూ వాదోపవాదంలోకి దిగుతారని నేననుకోను. కాని నాకూ నా గృహలక్ష్మికీ ప్రతీ సంక్రాంతి పెద్ద పండగనాటి రాత్రి శషభిషలే. శషభిషలంటే నిజంగా శషభిషలే. పాతపంచాగాలు తిరగేయడం పెద్దపెద్దల్ని తగవు తీర్చమనడం తుదకు వద్దువద్దు కొఱమాలిన గుద్దులాట అని ముద్దుముద్దుగా సయ్యొద్దె పడడం ఇన్నీ నడుస్తవి.

ప్రతీసంక్రాంతి పండక్కి అని పైనవ్రాసినప్పటికి ఇందున వివరించేదొక సంక్రాంతిపండక్కి జరిగిన సమాచారమే. తక్కినప్పటివికూడా అలాంటివే యైనప్పుడేదో యొక్కదానిని పుచ్చుకుని వ్రాస్తేచాలునని నా యభిప్రాయము. ఇంతకూ పండగలు కూడా ఏటేటావచ్చినా ఒకయేటి పండగ యేలాంటీదో మరుచటి సాలు పండగకూడా అలాంటిదిగానే ఔపిస్తూంటుంది. ముగ్గులంతే